పరిహారం నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఏటా జూలై, ఆగస్టు నెలలో సంభవించే వరదలకు ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం అందజేస్తుంది. ఇదే అదునుగా భావించిన కొందరు దళారులు ఇసుక భూములను సైతం పంట భూములుగా చూపి నష్టపరిహారం కాజేస్తున్నారని, ఒకే భూమికి ఉద్యానవన పంటగాను వరి పంటగాను రెండు నష్టపరిహారాలు లబ్ది పొందుతున్నారని, కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామానికి చెందిన కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం సోమవారం రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. 2021 నుంచి 2024 వరకు పంట నష్టం నమోదులో అవకతవకలపై ఆయన ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా తీసుకున్న సమాచారంపై అధికారులను నిలదీశారు. విషయం తెలుసుకున్న కొంతమంది తనపైన తన కుటుంబంపైన దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆర్‌డిఒకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కదం తొక్కిన స్కీం వర్కర్లు

ప్రజాశక్తి-అమలాపురం


అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న స్కీమ్ వర్కర్లు

రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కూటమి నేతల రాజకీయ వేధింపులపై చిరుద్యోగులైన స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం అమలాపురంలో కదం తొక్కారు. ఉద్యోగ భద్రత కోసం నినదించారు. రాజకీయ కారణాలతో తొలగించిన వారిని బేషరతుగా విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమస్యలపై డిఆర్ఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలకా సుభాషిణి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యవేణి, కంటింజెంట్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షులు పరంధామయ్య మాట్లాడారు. కొన్ని మండలాల్లో చిరుద్యోగులైన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్వీపర్స్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, వెలుగు యనిమేటర్లు, ఆర్‌పిలను రాజీనామా చేయాలని తీవ్రమైన రాజకీయ ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి నేతలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి నేడు అధికారంలోకి రాగానే ఉద్యోగులను తొలగిస్తూ మాజీ సిఎం వైఎస్.జగన్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను మార్చడానికి రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ఎంఎల్‌ఎ పదవి ముగియగానే రూ.50 వేలు పెన్షన్ ఇచ్చినట్లుగా, ఉద్యోగులకు కూడా రూ.25 వేల పెన్షన్ ఇస్తే రాజీనామాలు చేయడానికి తాము సిద్ధమేనని తెలిపారు. రాజకీయ వేధింపులపై స్థానిక ఎంఎల్‌ఎలను కలుస్తుంటే పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు కార్యకర్తల ద్వారానే తాము గెలిచామని చెప్పుకోవడం ప్రజా తీర్పును అవహేళన చేయడమేనన్నారు. స్థానిక కూటమి నాయకులను కట్టడి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలిక ఉద్యమాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఉన్నత విద్యాసంస్థల వైస్ ఛాన్సలర్లు, ఐఎఎస్, ఐపిఎస్, పోలీసు ఉన్నత అధికారులకు సైతం ఈ రాజకీయ వేధింపులు తప్పడం లేదని, ఇలాగే కూటమి నేతల వైఖరి కొనసాగితే ప్రజల్లో వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. తక్షణం రాజకీయ కారణాలతో తొలగించిన ఉద్యోగులను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా అధ్యక్షుడు జితేంద్ర, జిల్లా అంగన్‌వాడీ సంఘం నాయకులు విజయ, వెంకట లక్ష్మీ, సూర్య కళ, ఆశా సంఘం నాయకులు ఎస్తేరురాణి, దేవి, నాగమణి పద్మావతి, మొదలి దేవి, విమల, భార్గవి, మాలకా నాగలక్ష్మి, వేణి, విఒఎల సంఘం, నాయకులు, ఆర్‌పిలు, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో మహిళ అవస్థలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


కాశి జ్యోతి

గల్ఫ్ దేశమైన అబుదాబీలో చిక్కుకు పోయి అవస్థలు పడుతున్న ఒక మహిళ తనను ఇండియాకు రప్పించాలని ప్రభుత్వానికి సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంది. కేదార్లంక శివారు వీధివారి లంకకు చెందిన కాశి జ్యోతి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నాలుగు నెలల క్రితం పి.గన్నవరానికి చెందిన ఒక ఏజెంట్ ద్వారా అరబ్ షేక్ ఇంట్లో పని చేసేందుకు అబుదాబి (దుబాయ్) వెళ్లింది. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఇంటి చాకిరీ మొత్తం తానే చేయాల్సి రావడంతో తనకు ఆరోగ్యం క్షీణించిందని, కనీసం తనను సరిగా తిండి పెట్టకుండా పనులు చేయించుకుంటున్నారని ఆమె తెలిపింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తనను స్వదేశం రప్పించాలంటూ వేడుకుంటోంది.


ఆర్థిక సాయం అందిసున్న పూర్వ విద్యార్థులు

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మామిడికుదురు

అప్పనపల్లి అరుంధతి పేటకు చెందిన అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఆకుమర్తి జ్యోతి వైద్య ఖర్చులకు సోమవారం రూ.52 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక హైస్కూల్‌కు చెందిన 1999-2000 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.50 వేలు హైస్కూల్ హెచ్‌ఎం బావరాజు సూర్య ప్రకాశరావు రూ.2 వేలు ఆర్థిక సాయం అందించారు. తమ స్కూల్లో చదువుతున్న బాలిక జ్యోతి తండ్రి ఆకుమర్తి నాగేంద్ర ప్రసాద్‌కు రూ.52 వేలు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-అమలాపురం



అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సోమవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర జిల్లా అధికారులతో కలిసి కలక్టర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు. ఐసిడిఎస్ పీడీ ఝాన్సీ రాణి, డిఎం సివిల్ సప్లయ్ ఎల్లారావు, సమగ్ర శిక్ష డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదన్ రావుతో కలిసి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన అర్జీలను ప్రాధాన్యతగా ఎప్పటికప్పుడూ బాధ్యతా యుతంగా నూరు శాతం పరిష్కరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహన కలిగించుకొని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి భీమేశ్వర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, డిఎం హెచ్ఒ దుర్గారావు దొర, డిఇఒ కమల కుమారి పాల్గొన్నారు.

మత్స్యకార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం



ధర్నా నిర్వహిస్తున్న సంఘం నాయకులు

అల్లవరం మండలం బోడసకుర్రు రెబ్బనపల్లి తదితర గ్రామాల్లో మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఎపి మత్స్యకార్మిక సంఘం నాయకులు గ్రామంలో పర్యటించారు. మత్స్యకార గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా బోడసకుర్రులో గోదావరి నది ఒడ్డున కరకట్ట లేకపోవడం వల్ల గ్రామంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. తాగునీరు కలుషితమై చిన్న పిల్లలు, మహిళలు రోగాల బారిన పడుతున్నారు. నెల రోజుల పాటు చేపల వేటకు వెళ్ళక పోవడం వల్ల ఆర్థికంగా కష్టాలు పడుతున్నారని తెలిపారు. మత్స్యకార అధికారులు పట్టించుకోకపోవడం వల్లే చేపల వేట నిషేధ భృతి రావడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి డిఆర్ఒకు వినతిపత్రం ఇచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి టి.వరలక్ష్మి, పి.శ్రీనివాసరావు, నాగూల్ మీరా, జగతాడి రాఘువలు, సంగాని వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ చిన్ని ఆధ్వర్యంలో ముమ్మర పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్ ముగ్గు చల్లి క్లోరినేషన్ చేయించారు. గ్రామంలో వీధి దీపాలను మెరుగు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశ భ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ శ్రీ దుర్గ చిన్ని సూచించారు. టిడిపి నాయకులు చీకట్ల ఏసుబాబు, కాగిత సత్యనారాయణ, పరమట సాయిబాబు పనులను పర్యవేక్షించారు.


పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ముమ్మిడివరం ఎస్ఐగా సాగర్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రజల సహకారంతో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ అన్నారు. ఎస్ఐగా బదిలీపై వచ్చిన జ్వాలా సాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సురేష్‌బాబు మండపేట రూరల్ స్టేషన్‌కు బదిలీ కాగా, కొత్తపేట స్టేషన్ నుంచి జ్వాలా సాగర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని భౌగోళిక స్థితి గతులను అవగాహన చేసుకుని శాంతి భద్రతలను కాపాడటమే కాక పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని, ప్రజలంతా సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టడానికి ముందు సిఐ ఎస్.కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పరిస్థితులపై చర్చించారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జ్వాలా సాగర్‌ను స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

కోటిపల్లిలో ఆసీలు పాటల రద్దు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రమైన కోటిపల్లిలో వసూలు చేస్తున్న ఆసీలు పాటలను సోమవారం నుంచి రద్దు చేశారు. కోటిపల్లి వచ్చే యాత్రికుల బస్సులకు, కార్లకు, ఇతర వాహనాలకు కొన్నేళ్లుగా ఆసీలు వసూలు చేస్తున్నారు. దీనిపై పలువురు యాత్రికులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రహించిన మంత్రి వాహనాల నుండి ఎటువంటి ఆసీలు వసూలు చేయవద్దని ఆదేశించారు. యాత్రికులు ఫిర్యాదుపై వెంటనే స్పందించిన మంత్రికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

తల్లిపాల ప్రాముఖ్యతపై పలుచోట్ల సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


కిట్లు అందజేస్తున్న ఎంపిటిసి నాగరత్నం కుమారి

ఆలమూరు తల్లి పాలతోనే శిశువుల్లో రోగ నిరోధక శక్తి వద్ధి చెంది ఆరోగ్యంగా ఎదుగుతారని సర్పంచ్ కట్టా శ్రీనివాస్, మండల తెలుగు రైతు అధ్యక్షులు గొడవర్తి దుర్గాప్రసాద్(బాబి) అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జొన్నాడలో అంగన్వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా మహిళలకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు మారిశెట్టి సత్యనారాయణ, దొమ్మేటి వెంకన్న, వీరి సందీప్, బిడ్డ తల్లులు పాల్గొన్నారు.


మామిడికుదురు లూటుకుర్రు పిహెచ్‌సి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు నేతత్వంలో మాకనపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత మహిళలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి.అరుణ, ఎఎన్ఎం లావణ్య, అంగన్వాడీ కార్యకర్త మంగతాయారు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం తల్లిపాలలోనే చంటి పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని ఈ విషయాన్ని తల్లులు గ్రహించాలని ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్న కుమారి సూచించారు. భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి కె.విష్ణుప్రియ తల్లిపాల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బేబీ షో నిర్వహించారు. విజేతలకు ఎంపిటిసి నాగరత్న కుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.రమాదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి, పి.సత్యవతి, ఎఎన్ఎం కె.నాగవేణి, డి.సుశీల, డి.నాగకుమారి, లక్ష్మీ దుర్గ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమస్యలపె అర్జీలు ఇవ్వాలి

ఆలమూరు : తమ వ్యక్తిగత సమస్యలపై లబ్ధిదారులు త్వరితగతన స్పందించి స్పందనలో ఫిర్యాదు చేసుకోవాలని తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల వరదల నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చిన స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.శాలెం రాజు, మండల పరిషత్ ఎఒ రామ్ స్వరూప్, హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, వ్యవసాయ అధికారి ఎస్.లక్ష్మీలావణ్య, ఎపిఎం ఎం.ధనరాజు, ఎపిఒ అరుణకుమారి, తదితరులు హాజరయ్యారు.

కార్టూ'నిజం'


ఎక్కువగా మాట్లాడితే నాలుక చీరేస్తా

ఎస్‌పి వర్గీకరణ తీర్పుపై ఆందోళన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


ఉప్పలగుప్తంలో ఆందోళన చేస్తున్న దళితులు

ఎస్‌పి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ తీర్పును రద్దు చేయాలంటూ సోమవారం ఉప్పలగుప్తంలో దళితులు ఆందోళన నిర్వహించారు. మాల మహానాడు మండల జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టికల్ 341 అనుసరించకుండా పార్లమెంట్‌లో చర్చ కూడా జరగకుండా కోర్టు తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యమాన్ని ఉధృతం చేసి న్యాయం జరిగే వరకూ పోరాడి వర్గీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పుకు నిరసన తెలిపేందుకు ఈ నెల 11న అమలాపురంలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమంలో దళితులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పిల్ వేయడానికి మాల మహానాడు జెఎసి సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ వివిఎస్ దివాకర్‌కు దళిత నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపిటిసిలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, పెట్టా అప్పారావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు కొంకి వెంకట బాబ్జి, దళిత నాయకులు పెయ్యల పరశురాముడు, కుంచే బాబులు, అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, చింతా రామకష్ణ, తాళ్ల రవి, జొన్నాడ చిన్ని, దేవరపల్లి రాంబాబు, పోలినాటి వెంకటేశ్వరరావు, వస్కా మల్లేశ్వరరావు, పెయ్యల కొండబాబు, దోనిపాటి అశోక చక్రవర్తి, గెద్దాడ బుద్ధరాజు, మెండి డేవిడ్‌రాజ్, పండు సత్యనారాయణ, సాపే రమేష్, పోలినాటి భీమేష్, పెయ్యల రమణ, నడింపల్లి సుబ్బరాజు, కోటుం లోవరాజు, జనిపెల్ల సంపత్ కుమార్, పినిపే కొండబాబు, పెయ్యల ఆదినారాయణ, పరమట మురళి, పండు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిల విడుదల కోసం ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం



కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నా

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఈ ధర్నాలో ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సుమారు రూ.72 కోట్లు బకాయి వేతనాలు ఉన్నాయన్నారు. తక్షణం వాటిని విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూలీల ఆకలి బాధలు తక్షణం తీర్చే విధంగా నిధులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి వరకు ఎన్నికలని నేడు అప్పుల్లో ఉన్నామని కూలీలను ఇబ్బందులు గురి చేయడం తగదని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలుగా చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా ఉపాధి కూలీలను పస్తుల పాలు చేస్తున్నారని ఈ మూడు నెలల కాలంలో అనేక దఫాలు ప్రభుత్వానికి నివేదికలు వినతిపత్రాలు అందించామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా చలించడం లేదన్నారు. ఒక వారం రోజుల్లో బకాయి వేతనాలకు విడుదల చేయకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సుమారు 350 మంది వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, పొలమూరు శ్రీనివాసరావు, తాడి శ్రీరామ్మూర్తి, ఇసుపట్ల మంగాదేవి, ఎం.రాజేశ్వరి, పెట్టా ఆనందరావు, రాయుడు వెర్రమ్మ, మంగాలక్ష్మి, గుత్తుల సత్యవతి పాల్గొన్నారు.


వంతెన వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నదీ కోత నివారణకు రైతుల నిరసన

ప్రజాశక్తి -మామిడికుదురు

ఏటా వరదల సమయంలో నదీకోత శృతిమించి సారవంతమైన భూములతో పాటు నివాస గృహాలు నదీ గర్భంలో కలిసిపోయి నష్టపోతున్నామంటూ పాశర్లపూడి బాడవలో వైనతేయ వారధి వద్ద బురదలో సోమవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఏటా వరదల సమయంలో నదీ గర్భంలో విలువైన భూములు కలిసిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నదీ కోత నివారణకు రివిట్మెంట్లు, గ్రోయన్స్ నిర్మించాలని గత ప్రభుత్వంలో పలుమార్లు ఆందోళన చేపట్టినా పట్టించుకోలేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం నదీ కోత నివారణకు రివిట్‌మెంట్లు, గ్రోయన్స్ నిర్మించి విలువైన తమ భూములతో పాటు నివాస గహాలు నదీ గర్భంలో కలిసిపోకుండా ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కేదార్లంక గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన కార్యకర్త సదా సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని సోమవారం పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేవాదళ్ సంస్థ, అంగర గ్రామస్తుల ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.1,10,000 ఆర్థిక సాయాన్ని బాధిత లీలాకృష్ణ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్న జనసేవాదళ్ సంస్థ సభ్యులకు లీలాకృష్ణ ప్రత్యేక అభినందలు తెలిపారు. బాధిత కుటుంబానికి జనసేన పార్టీ తరుపున తాము అండగా ఉంటామని లీలాకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేదార్లంక గ్రామ ప్రజలు, జనసేవాదళ్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

మండపేట బస్టాండ్ సమీపంలో శ్రీ సాయి ఆర్థో ట్రామా కేర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ విభాగాన్ని, డాక్టర్ కె.రాము పుట్టినరోజు సంధర్బంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న డాక్టర్ రామును అభినందించారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య నిపుణులు పలు వ్యాధులకు సంబంధించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందజేసి మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, కోన సత్యనారాయణ, పాలచర్ల శిరీష్, కాళ్ళకూరి గొల్లబాబు, కొవ్వాడ అప్పన్నబాబు, మందపల్లి దొరబాబు, శెట్టి రవి, కురసాల సత్యనారాయణ, గుండు తాతరాజు, గడి రాంబాబు, వైద్య నిపుణులు ,ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట బోదె ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం


ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న వెంకటేశ్వరావు, బాధితులు

కాట్రేనికోన మండలం పల్లంకుర్రు బూలవారి పేటలో పంట బోదెను ఆక్రమించి పేద రైతులకు సాగు నీరు అడ్డుకుంటున్న భూస్వామి సాపే సత్యనారాయణపై చర్యలు తీసుకుని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో డిఆర్ఒ వెంకటేశ్వర్లుకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పేద రైతుల భూమికి సాగు నీరు అందించే పంట బోదెను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు వాకపల్లి వెంకటేశ్వరరావు, తాటిపాక స్వరూప్, కాశి సత్యనారాయణ మాట్లాడుతూ మూడు తరాల నుంచి మెయిన్ కాలువ మీదుగా పంట బోదె ద్వారా సుమారు ఎకరం పొలాన్ని పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. మూడేళ్ల క్రితం పేద రైతుల భూమికి ఆనుకుని ఉన్న పొలాన్ని సత్యనారాయణ కొనుగోలు చేశారని, సాగు నీరు వెళ్లే పంట బోదెను తన పొలంలో కలిపేసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పేద రైతులు అడగ్గా దౌర్జన్యం చేశారన్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఎటువంటి ఫలితం లేదని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గతనెల 22వ తేదీన మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన తవిటికి మానస అమలాపురంలో పరీక్ష రాయడానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె ఆచూకీ కోసం ఎంతగా వెతికినా కన్పించలేకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - వాగల్లు

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత 20 ఏళ్ల క్రితం బ్రాహ్మణ గూడెం గ్రామానికి చెందిన చౌదరి అంకంనాయుడుతో చౌదరి ఆరుద్ర ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి తన అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, అలాగే తన భర్త అంకం నాయుడు చెడు అలవాట్లకు బానిసై తనను వేధిస్తున్నట్లు ఆరుద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆరుద్రకు 13 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు ఆయన తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

దంతాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పెదపూడి

దంతాల సంరక్షణపై అందరు అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంఇఒ-2 సివివి.సత్యనారాయణ అన్నారు. పెదపూడి, కైకవోలు, కరకుదురు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కాకినాడ అధ్యక్షుడు డాక్టర్ కోరా నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్న వయస్సులోనే దంతాల సంరక్షణపై వైద్యుల సూచనలు సలహాలు పాటించి దంతాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి, కైకవోలు హెచ్ఎంలు కె. సత్యనారాయణ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మత్స్యకారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన నిర్వహించారు. సోమవారం స్థానిక మత్స్యకార గ్రామాలైన సావిత్రి నగర్, గిరియంపేట గ్రామాల్లో పిఎంఎంఎస్‌వై పథకం కింద మత్స్యకారుల నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా బోట్ ఇంజిన్ లోపాన్ని సరిదిద్దడం, వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. మత్స్యశాఖ అధికారి డి గొంతెయ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ శిక్షణలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన సిఐఎఫ్ఎన్ఇటి అధికారులు వి.ఎల్. పూజార్, హరనాథ్, అర్జున్, ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

7న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట వాటర్ వర్క్స్‌లో నిర్వహణ, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 7వ తేదీ సాయంత్రం కనకాలపేట, గణపతి నగర్, యుకెవి నగర్, భీమ్ నగర్, పెద్దిరెడ్డి గార్డెన్స్, కోన గార్డెన్స్, ఫ్రాన్స్ తిప్ప ఏరియాలలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని కోరారు. నీటిని వృధా చేయరాదని సూచించారు.

'దోని గంగమ్మ' కథకు నగదు బహుమతి

ప్రజాశక్తి - యానాం

తటవర్తి భారతి స్మారక ప్రపంచ స్థాయి కథల పోటీలో యానాంకు చెందిన కథకుడు రత్నాకర్ పెనుమాక రాసిన కథ రూ.10 వేలు నగదు బహుమతికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఈ కథా పోటీలకు కథా రచయితగా రాణిస్తున్న రత్నాకర్ పెనుమాక 'దోని గంగమ్మ' అనే కథను పంపించారు. ఈ మేరకు తన కథ నగదు బహుమతికి ఎంపికైనట్లు కథల పోటీల నిర్వాహకులు నుంచి సమాచారం అందినట్లు రత్నాకర్ సోమవారం తెలిపారు. ఈ పోటీలకు ప్రొఫెసర్ సి.హెచ్.సుశీలమ్మ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీలో రత్నాకర్‌తోపాటు పలువురు కథకులు ఆయా స్థాయిల్లో నగదు బహుమతులకు ఎంపికయ్యారు. రత్నాకర్ త్వరలో నిర్వహించే సభలో బహుమతిని అందించి, సత్కరించనున్నారు. ఇప్పటికే ఒక కథా సంపుటి వెలవరించిన రత్నాకర్ కథకుడుగా గతంలో కూడా పలు అవార్డులు, బహుమతులు పొందారు. కథా రచనలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న రత్నాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



గుంతలతో రెవెన్యూ కార్యాలయ ఆవరణ

'రెవెన్యూ' ముంగిట నీటి గుంతలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల రెవెన్యూ కార్యాలయం ముంగిట నీటి గుంతలతో అటు అధికారులు, సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కార్యాలయం కాంప్లెక్స్‌లో సబ్ ట్రెజరీ, ఎస్‌సి డివిజన్, హౌసింగ్, ఐసిడిఎస్, డ్వామా, స్త్రీశక్తి కార్యాలయాలు ఉన్నాయి. ప్రతీరోజు ఆయా కార్యాలయాలకు మండలంలోని 23 గ్రామాల నుంచి వందలాదిగా ప్రజలు వచ్చి వెళ్లే పరిస్థితి ఉందికి కార్యాలయాల ముంగిట చెరువులను తలపించేలా గుంతలు ఉండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే నీటి గుంతలకు మర్మతులు చేపట్టేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

జడ్‌పి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని నెస్లే ఇండియా కార్పొరేట్ ఎఫైర్స్ మేనేజర్ వసీమ్ అహ్మద్ అన్నారు. సోమవారం నెస్లే ఇండియ సిఆర్‌సి నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం యు.మీనా మాధురి మాట్లాడుతూ పాఠశాలలో 550 మంది విద్యార్థులు ఉన్నాయని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు, కాలేజీ విద్యార్థులకు మరో యూనిట్ మరుగుదొడ్డిని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే మూడు మరుగుదొడ్ల యూనిట్స్‌ను నిర్మించామని తెలిపారు. మరో యూనిట్‌కు అవసరమైన నిధులను వెచ్చించేందుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే పాఠశాల క్రీడాప్రాంగణాన్ని గ్రీనరీగా చేసేందుకు కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి. పుల్లయ్య, వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ, టిడిపి వార్డు ఇన్‌ఛార్జ్ దాట్ల శ్రీనివాసరావు, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మరుగు దొడ్ల ప్రారంభం కార్యక్రమంలో దాతలు, విద్యార్థులు,

సుంకవల్లికి ఎంఎల్ఎ జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని యల్లమిల్లి గ్రామానికి సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. సోమవారం జగ్గంపేటలో జరిగిన అన్న క్యాంటీన్ కార్యక్రమంలో పాల్గొని సుంకవల్లి తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయనను జగ్గంపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి భద్రం, ముంద్రు ఎర్రబాబు, మండపాక అప్పన్నదొర, మాదిరెడ్డి కృష్ణార్జున, మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



సుంకవల్లిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజావసరాలను తీర్చడమే బాధ్యత

ప్రజాశక్తి - కిర్లంపూడి

ప్రజల అవసరాలను తీర్చడం నా బాధ్యత అని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో సోమవారం గొల్లల గుంట రింగ్ రోడ్ మీదుగా వెళ్లే నూతన బస్సు సర్వీసును ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలను తీర్చడంలో భాగంగానే ఈ నూతన బస్సు సర్వీస్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సర్వీసు వల్ల సోమవరం, ఇర్రిపాక, మామిడాడ, నరేంద్ర పట్నం, కాండ్రేగుల, గొల్లలగుంట, గుర్రంపాలెం, జగ్గంపేట మీదుగా కాకినాడకు వెళ్లే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈబస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం

ప్రజాశక్తి - గండేపల్లి

మల్లేపల్లి నుంచి ఎన్‌టిరాజాపురం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దానిస్థానే కొత్త రోడ్డును నిర్మిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. సోమవారం ధ్వంసం అయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు అంశాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి కొత్త రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ పర్యటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి సింగలూరి రామ్‌దీపు, పితాని వీరబాబు, బత్తుల వెంకట రమణ,హరీష్, బలిరెడ్డి గణేష్ పాల్గొన్నారు.



కౌలు రైతు కార్డును అందిస్తున్న బాబి

కౌలుదారు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పలువురు కౌలు రైతులకు రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి దూళిపూడి వెంకటరమణ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, యంపిటిసి సభ్యులు నాగేంద్ర ప్రసాద్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, నిమ్మకాయల మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి ఎస్ఐగా సతీష్ నియామకం

ప్రజాశక్తి - కిర్లంపూడి

స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.సతీష్‌ను సాధారణ బదిలీల్లో నియమితులయ్యారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న షేక్ జబీర్‌ను విఆర్‌కు పంపించారు. ఏలేశ్వరంలో ఎస్ఐగా పనిచేసిన సతీష్ కిర్లంపూడి ఎస్ఐగా ఒకటి, రెండు రోజుల్లోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.



మస్టర్ రికార్డును పరిశీలిస్తున్న కమిషనర్

విధులకు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ భావన హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామున ఆమె పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా నగరంలోని ఐదో సర్కిల్ పరిధిలోని మస్తర్‌ను పరిశీలించారు. అనంతరం ఏటిమొగ వెహికల్ యార్డ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఏటిమొగ వెహికల్ యార్డుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వరహాలయ్యపేట సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని మరిడమ్మ జాతర సందర్భంగా వరహాలయ్య పేటలో సోమవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంబరంలో ఏర్పాటుచేసిన గరగల నృత్యాలు, కాళికా నృత్యాలు, జానపద కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణతో బండ్ల వేసాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ రవికుమార్, ఎస్ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేవారు. సంబరాన్ని కమిటీ సభ్యులు బైలపూడి సత్యనారాయణ, దాసరి రమేష్ కుమార్, బొడ్డు సూర్యప్రకాష్, బండారు వీరభద్రరావు, కొల్లి ప్రకాష్, బైలపూడి ప్రకాష్, కొల్లి పోతురాజు పర్యవేక్షించారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

పల్లెల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రపు కొత్తియ్య కోరారు. సోమవారం ఆర్‌డిఒకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు. ఈ క్రమంలో పలువురు గాయాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. ఆయన వెంట బిఎస్‌పి నేతలు కాండ్రేగుల గంగరాజు, నెల్లి మహేష్, విజ్జేశ్వరపు మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కొత్తియ్య

అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు సోమవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నియామక పత్రాలు అందజేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఎంపికైన వీరందరూ వారం రోజుల లోపు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ వారికి తెలిపారు.

అమెజాన్‌లో ఉద్యోగాలకు జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

ప్రముఖ కంపెనీ అమెజాన్‌లో పనిచేసేందుకు ఈ నెల 08న ఉదయం 10:30 గంటలను జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి తెలిపారు. ఈ కంపెనీలో రూ.18 వేల వరకు వేతనం ఇస్తారని తెలిపారు. 10వ తరగతి ఆపై చదివిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరవ్వాలని తెలిపారు. వివరాల కోసం 8121838392నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 21 ఫిర్యాదులు

ప్రజాశక్తి-అమలాపురం

పోలీసు గ్రీవెన్స్‌కు సోమవారం 21 ఫిర్యాదు అందినట్టు జిల్లా అదనపు ఎస్‌పి ఎస్.ఖాదర్ బాషా తెలిపారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు సూచించారు.